క్లుప్తంగా

వెండి వడ్డాణం సమర్పణ



ఈఓకు వెండి వడ్డాణం అందజేసిన నారాయణరెడ్డి దంపతులు

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మకు అన్నమయ్య జిల్లా సంబేపల్లె మండలం కండివాండ్లపల్లెకు చెందిన నారాయణరెడ్డి దంపతులు వెండి వడ్డాణం సమర్పించారు. మొక్కులు ఫలించడంతో వెండి వడ్డాణంతో పాటు గోశాలకు రూ.50,116, అలాగే బెంగళూరుకు చెందిన బీవీ. చంద్రప్పరూ.50,001 , బెంగళూరుకు చెందిన ఎస్.వెంకటరెడ్డి రూ.10 వేలు ఇచ్చారని ఈఓ ఏకాంబరం ఆదివారం తెలిపారు. దాతలను సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు.

అమరవీరునికి అశ్రు నివాళి



మురళీనాయక్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

సదుం: వీర మరణం పొందిన సైనికుడు మురళీ నాయక్‌కు ఏపీ గిరిజన సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నివాళులు అర్పించారు. బస్టాండులో ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేసి, పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. దేశం కోసం ప్రాణాలొడ్డిన ఆయన స్ఫూర్తి యువతకు ఆదర్శమన్నారు. భారత్‌మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. సంఘం మండల అధ్యక్షుడు హరి శివప్ప, ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు, హరి, భానుప్రకాష్, ప్రసాద్‌రావు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కావమ్మ, మారయ్య తిరునాళ్ల



ఊరేగింపుగా వెలుతున్న మహిళలు

సదుం: మండలంలోని భట్టువారపల్లె కావమ్మ, మారయ్య ఆలయంలో మూడు రోజుల తిరునాళ్ల ఘనంగా నిర్వహించారు. చివరి రోజు ఆదివారం సదుం నుంచి మహిళలు మేళతాళాలతో ఊరేగింపుగా ఆలయానికి వచ్చి, పొంగళ్లు పెట్టి, నైవేద్యం సమర్పించారు. జంగాలకథను బుర్రకథ రూపంలో వివరించారు. అర్ధరాత్రి అనంతరం కంకణధారులు అగ్నిగుండ ప్రవేశం చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. పూజల అనంతరం తిరునాళ్ల ముగిసింది. కార్యక్రమంలో బెస్త సంఘం నాయకులు రత్న, నాగభూషణం, దేవేంద్ర, కరెంటు బాబు, భాస్కర్, కుమార, శ్రీన, దేవ తదితరులు పాల్గొన్నారు.

హంస వాహనంపై మృత్యుంజయేశ్వరుడి కటాక్షం



హంసవాహనంపై విహరిస్తున్న ఉత్సవమూర్తులు

చౌడేపల్లె: స్థానిక శ్రీ అభీష్టద మృత్యుంజయేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా తొమ్మిదవరోజైన ఆదివారం రాత్రి స్వామివారు హంస వాహనంపై పురవీధులలో విహరించారు. తొలుత ఉదయం శివపార్వతులను అర్చకులు రాజశేఖరదీక్షితులు, కుమారస్వామి, మహేష్ ప్రత్యేకంగా అలంకరించారు. ఉత్సవమూర్తులను మేళతాళాలు, మంగళ వాయిద్యాల హోరు నడుమ ఊరేగించారు. స్వామివారు ఇంటింటా పూజలు అందుకున్నారు. ఉభయదారులుగా బ్రాహ్మణ సంఘం వ్యవహరించింది. భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. పగలు స్వామివార్ల ఉత్సవమూర్తులను మేళ తాళాల నడుమ ఊరేగించారు.

ఘనంగా విరూపాక్షమ్మ గంగజాతర



జాతరలో చేస్తున్న హోమం

పులిచెర్ల(కల్లూరు): కల్లూరు–పుంగనూరు రోడ్డులోని విరూపాక్షమ్మ గంగజాతర ఆదివారం వేడుకగా మొదలైంది. మూడు రోజుల జాతరలో తొలిరోజు మదిరి గురుస్వామి దంపతులు అమ్మవారి పంచలోహ విగ్రహాన్ని సమర్పించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు, హోమం చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

ప్రమాదమని తెలిసినా..!



దేవస్థానం ట్రాక్టర్‌లో భక్తులను తరలిస్తున్న దృశ్యం



చెత్త తరలింపు టాటా ఏస్ వాహనంలో ఆలయం వద్దకు వెళ్తున్న భక్తులు

- ట్రాక్టర్, చెత్త తరలించే వాహనంలో భక్తులు తరలింపు
- ఇదీ బోయకొండ దేవస్థానం ఉచిత రవాణా
- ఆటోలు, జీపుల ప్రయాణ వివాదమే కారణమా..?
- ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది?

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ దర్శనార్థం ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు ఆదివారం తరలివచ్చారు. నడవలేని మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లలు గతంలో జీపుల ద్వారా కొండపైకి చేరుకునేవారు. కొండపై ఏటవాలుగా ఉన్న రోడ్డు మార్గంలో ట్రాక్టర్‌లో ఆలయం వద్దకు వెళ్లడం ప్రమాదమని తెలిసినా ఆదివారం సాక్షాత్తు దేవస్థానానికి చెందిన అధికారుల ఆదేశాల మేరకు సిబ్బంది చేత ట్రాక్టర్‌తో పాటు చెత్తసేకరణ కోసం కేటాయించిన మినీ టాటా ఏస్ వాహనంలో ఆలయం వద్దకు భక్తులకు ఉచిత రవాణా కల్పించారు. ఇటీవల జీపుల్లో బోయకొండకు యాత్రికులను టికెట్టు రూ.20 నుంచి రూ.40 వరకు వసూలు చేసి తరలించేవారు.జీపులు, ఆటోల యజమానులతోపాటు కూటమి నేతల ఒప్పందం విషయమై వివాదం తారస్థాయికి చేరిందని సమాచారం. దీంతో వాహనాలు ఆదివారం బోయకొండపైకి రాకుండా చేశారని తెలిసింది. గతంలో బోయకొండ గంగాపురం నుంచి కొండపై ఆలయం వద్దకు ట్రాక్టర్లు, ఆటోలు, వాహనాలు వెళ్లేందుకు అధికారులు, పోలీసులు నిషేధించారు. సుమారు ఇరవై ఏళ్ల క్రితం రణభేరి గంగమ్మ ఆలయ సమీపంలోని చెక్‌పోస్టు సమీపాన ట్రాక్టర్ బోల్తా పడి సుమారు 9 మంది అప్పట్లో మృతిచెందారు. ఆ ఘటన అనంతరం ట్రాక్టర్లు, ఆటోలను నియంత్రించారు. మళ్లీ దేవస్థానం అధికారులే ఉచితంగా ట్రాక్టర్‌లో భక్తులను తరలించడం చర్చకు తావిచ్చింది. దాదాపు 600మీటర్ల దూరమే అయినప్పటికీ ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారంటూ భక్తులు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు ఉచితం అనగానే..భక్తులు అధిక సంఖ్యలో ప్రయాణం సాగించారు. కోట్లాది రూపాయలు ఆదాయం ఉన్న బోయకొండ ఆలయం వద్ద భక్తులకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని ఈ ఉదంతం చెప్పకనే చెప్పింది.

ప్రజాకంటక పాలనకు చరమగీతం తప్పదు



- ఎటుచూసినా ఇసుక, మట్టి మాఫియా
- కూటమికి తొత్తులుగా మారిన పోలీసులు, అధికారులు
- మాట్లాడితే వైఎస్సార్‌సీపీ నేతలపై తప్పుడు కేసులు
- పలమనేరు మాజీ ఎమ్మెల్యే, సమన్వయకర్త వెంకటేగౌడ

పలమనేరు: సూపర్‌సిక్స్ హామీలతో ఊదరగొట్టి, అధికారంలోకి వచ్చాక తీరా వాటిని నెరవేర్చకుండా చంద్రబాబునాయుడు దగా చేశారని ప్రజలు ఆగ్రహంతో రగిలిపోతున్నారని, ఎప్పుడు ఎన్నికలొచ్చినా కూటమి ప్రభుత్వానికి చరమ గీతం పాడేందుకు సిద్ధంగా ఉన్నారని పలమనేరు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ కో–ఆర్డినేటర్ ఎన్.వెంకటేగౌడ వ్యాఖ్యానించారు. ‘సాక్షి’ ఇంటర్వ్యూలో ఆయన కూటమి పాలనపై నిప్పులు చెరిగారు.

యథేచ్ఛగా ఇసుక, మట్టి అక్రమ రవాణా

కౌండిన్య నదితోపాటు పలు చెరువుల్లో నిత్యం వందలాది ట్రాక్టర్ల ఇసుక అక్రమరవాణా జరుగుతోందన్నారు. ఇక చెరువుల్లో మట్టి మాఫియా పెట్రేగిపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు.

చెరువులు, కుంటల ఆక్రమణలు

నియోజకవర్గంలో మొత్తం 787 చెరువులుండగా వీటిల్లో మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు 57 దాకా ఉన్నాయన్నారు. చిన్నపాటిగా ఉన్న కుంటలు 60 దాకా ఆక్రమణలకు రూపురేఖలు మారిపోయాయని, మిగిలిన వంద వరకూ చెరువులు 10నుంచి 30 శాతం దాకా ఆక్రమణలు జరిగాయన్నారు. ఈ చెరువుల కింద గతంలో 20వేల హెక్టార్లు సాగులో ఉండగా, ఆక్రమణల దెబ్బకు ఇప్పుడు 2వేల హెక్టార్లలో మాత్రమే సాగు చేస్తున్నారని తెలిపారు.

సూపర్ సిక్స్ క్లీన్‌బౌల్డ్

ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను చంద్రబాబు ఎందుకు నెరవేర్చలేదని ప్రశ్నించారు. తల్లికివందనం, ఉచితబస్సు, రైతులకు రూ.20వేలు, ప్రతి మహిళకు రూ.15వేలు ఏమైందని ప్రశ్నించారు. సామాజిక పింఛన్లలో 40 శాతం తొలగించి వారి ఉసురు పోసుకుంటున్నారని చెప్పారు.

కొండెక్కిన అభివృద్ధి పనులు

నియోజకవర్గంలోని గంగనశిరస్సు, కైగల్ ప్రాజెక్టు ఏమైందో నేతలకే తెలియని పరిస్థితి ఉందని హంద్రీ–నీవాలో నీరు వస్తుందో రాదోగాని కాంట్రాక్టర్‌కు సైతం డబ్బులు వచ్చేలా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఘాటుగా విమర్శించారు. టమాట రైతులు నిండా మునిగిపోయినా వారిని పట్టించుకున్న పాపానపోవడం లేదని విమర్శించారు.

అధికార పార్టీకి కొమ్ముగాస్తున్న ఎంపీడీఓలు

నియోజకవర్గంలోని ఎంపీడీఓలు అభివృద్ధి పనులకు మంజూరైన నిధులను కూటమి నేతలకు జేబులు నింపే ఏజెంట్లు మారారని ఆరోపించారు. రూ.2 కోట్ల వరకూ నిధులు మంజూరైనా పనులు చేయకుండా అడ్డుకోవడం, కోర్టులు ఆదేశించినా బేఖాతరు చేయడం చూస్తే ప్రజలే నిలదీసే రోజులొస్తాయన్నారు.

తప్పుడు కేసులను న్యాయస్థానాల్లో ఎదుర్కొంటాం

పోలీస్ యంత్రాంగం కూటమి నేతల చేతుల్లో కీలుబొమ్మలు మారి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా యాక్టివిస్టులపై అక్రమంగా కేసులు పెట్టి భయపెడుతున్నారని విమర్శించారు. తనపై కూడా పోలీసులు అక్రమ కేసులు పెట్టారని వీటికి భయపడే ప్రసక్తే లేదన్నారు. ఏ కార్యకర్తకైనా, ప్రజలకైనా ఏకష్టమొచ్చినా తాము అండగా ఉంటామన్నారు. వీరు పెట్టే తప్పుడు కేసులను న్యాయస్థానాల్లో ఎదుర్కొంటామన్నారు.

సూర్య, చంద్రప్రభలపై చిద్విలాసం



చంద్రప్రభ వాహనంపై శ్రీవారు

గంగవరం: మండలంలోని టీటీడీ అనుబంధ కీలపట్ల శ్రీకోనేటిరాయస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో 7వ రోజు ఆదివారం అఖిలాండ బ్రహ్మాండ నాయకుడైన శ్రీనివాసుడు ఉదయం సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ వాహనాల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. తొలుత ఉదయం ఆలయంలో స్వామివారిని సుప్రభాతసేవతో మేల్కొలిపారు. తోమాల సేవ, అర్చన, నిత్య కైంకర్యాల అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. అనంతరం ఆస్థాన మండపం నుంచి స్వామివారు వాహన మండపానికి వేంచేసి సర్వాలంకార భూషణుడై బద్రీనారాయణుడి అవతారంలో సూర్యప్రభ వాహనంలో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. అధిక సంఖ్యలో భక్తులు వాహనం ఎదుట టెంకాయలు కొట్టి కర్పూర హారతులు సమర్పించారు. వాహన సేవ అనంతరం స్వామివారు తిరిగి ఆస్థాన మండపానికి చేరుకుని సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేతంగా ఉయ్యాలసేవతో సేదదీరారు.

అంతరంగిక దర్బార్‌లో కృష్ణుడిగా..

రాత్రి శ్రీనివాసుడు చంద్రప్రభ వాహనంపై ఆంతరంగిక దర్బార్ కృష్ణుడి అవతారంలో పురవీధుల్లో విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. ఏడు రోజులుగా పలు వాహనాల్లో విహరిస్తూ అలసిసొలసి తన అంతరంగిక దర్బార్‌లో దర్బార్ కృష్ణుడిగా వ్యవహరిస్తారని పురాణ ప్రశస్తి.

బ్రహ్మోత్సవాల్లో నేడు

8వ రోజు సోమవారం ఉదయం స్వామివారి రథారోహణం, రథోత్సవం, సాయంత్రం ఊంజల్‌సేవ, రాత్రికి అశ్వ వాహనంపై శ్రీవారు విహరిస్తారని ఆలయ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ స్పెషల్‌గ్రేడ్ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గోపీనాథ్, ఆలయ సూపరింటెండెంట్ రాజ్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నీరుకుండ గజేంద్ర, టీటీడీ అర్చకులు పాల్గొన్నారు.

ముగ్గురు వైఎస్సార్‌సీపీ నేతలపై వేటు

కుప్పం : కుప్పం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ పార్టీ సిద్ధాంతాలకు విరుద్ధంగా పనిచేయడమే కాకుండా క్రమశిక్షణ ఉల్లంఘించడంపై ముగ్గురు వైఎస్సార్‌సీపీ నేతలపై సస్పెండ్ వేటు వేస్తున్నట్లు కుప్పం నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎమ్మెల్సీ భరత్ ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరు జడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, కుప్పం మండల వసనాడు మాజీ సర్పంచ్ మురళీ, శాంతిపురం మండలం మొరసనపల్లి సర్పంచ్ భార్య నీలమ్మను పార్టీ నియమ నిబంధనలను పక్కన పెట్టి వైఎస్సార్‌సీపీకి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని జిల్లా ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి ఫిర్యాదు మేరకు ముగ్గురిపై సస్పెండ్ వేటు వేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. వీరి ముగ్గురి వైఎస్సార్‌సీపీ సభ్యత్వాన్ని రద్దు చేస్తున్నట్లు తెలిపారు. వీరు ఎలాంటి కార్యక్రమాలు చేసినా వైఎస్సార్‌సీపీకి సంబంధం లేదని ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

హనుమంత వాహనంపై విహారం

సదుం: మండలంలోని బూరగమందలో శ్రీదేవీ, భూదేవీ సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం పూజలు, అభిషేకాలు, తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. రాత్రి స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించిన హనుమంత వాహనంపై ఊరేగించారు. భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు. రఘు ప్రసాద్ కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు.

ఉరేసుకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి



వి.కోట : గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని కుమ్మరమడుగు పరిసరాల్లోని అడవిలో ఓ గుర్తుతెలియని వ్యక్తి చెట్టుకు ఉరివేసుకుని చెట్టుకు వేలాడుతూ కన్పించగా గొర్రెల కాపారులు గమనించారు. ఈ విషయాన్ని పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గుర్తు తెలియని మృతదేహంగా పరిగణించారు. మరణించిన వ్యక్తి వయస్సు సుమారు 55 నుంచి 60 ఏళ్లు ఉండొచ్చన్నారు. వెంట్రుకలు తెల్లబడి, మాసిన గడ్డం, కంటి అద్దాలు ధరించి, ఫుల్ షర్ట్, లుంగీ ధరించి ఉన్నాడన్నారు. అనుమానాస్పదంగా మృతి చెందిన వ్యక్తి ఆచూకీ తెలిసినవారు వి.కోట సీఐ 94409 00740, ఎస్‌ఐ 94405 47117 నంబర్‌లకు సమాచారం ఇవ్వాలన్నారు.

వాహనాల తనిఖీ

చౌడేపల్లె: మండల కేంద్రంలో ఆదివారం పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. దేశ సరిహద్దుల్లో ఉన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు వాహనాలను తనిఖీ చేసినట్లు ఎస్‌ఐ నాగేశ్వరరావు చెప్పారు. బస్టాండు కూడలిలో ప్రయాణికుల లగేజీతోపాటు వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనుమానితులను గుర్తించి విచారణ చేస్తున్నారు. వాహనాలకు సరైన రికార్డులు లేని వారికి జరిమానాలు విధించారు

దౌర్జన్యంగా మామిడి కాయల కోత.. అడ్డుకున్న మహిళపై దాడి



పీలేరులో చికిత్స పొందుతున్న అనురాధ

రొంపిచెర్ల : తోటలో తమకు తెలియకుండా దౌర్జన్యంగా మామిడి కాయలు కోస్తున్నారని అడ్డుకున్న మహిళపై కొందరు దాడి చేసి గాయపరిచినట్లు రైతు అనురాధ తెలిపారు. బాధితురాలి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మోటుమల్లెల పంచాయతీ సవ్వావాండ్లపల్లెకు చెందిన అనురాధకు 5 ఎకరాల్లో మామిడి తోట ఉంది. అయితే డబ్బు అవసరమై అదే గ్రామానికి చెందిన లేట్ విశ్వనాథనాయుడు వద్ద భూమి తాకట్టు పెట్టి 2021 సంవత్సరంలో రూ.12 లక్షలు అప్పు తీసుకుంది. ఇప్పుడు ఆ భూమి తమదేనని విశ్వనాథనాయుడి కుటుంబ సభ్యులు ఆక్రమించుకుంటున్నారని వాపోయారు. తాను తీసుకున్న అసలు, వడ్డీ ఇస్తానని చెప్పినా వినడం లేదని విలపించారు. ఆదివారం విశ్వనాథ నాయుడు కుటుంబ సభ్యులు దౌర్జన్యంగా వచ్చి మామిడి కాయలు కోశారని తెలిపారు. అడ్డుకోబోయిన తనను కొట్టి గాయ పరిచారని తెలిపారు. దీనిపై పోలీసులు విచారించి న్యాయం చేయాలని బాధితురాలు కోరారు.

వీ.కోటలో నాకాబందీ

వి.కోట: వాహనచోదకులు రోడ్డు భద్రత నియమ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని వి.కోట ఎస్‌ఐ జావీద్‌బాషా హెచ్చరించారు. ఆదివారం స్థానిక వైఎస్సార్ సర్కిల్‌లో నాకాబందీ నిర్వహించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా, ట్రిపుల్ రైడింగ్ ,హెల్మెట్ లేకుండా వాహనాలను నడుపుతున్న మోటార్ సైక్లిస్టులకు జరిమానా విధించారు. విధిగా హెల్మెట్ ధరించాలని, రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ఎస్‌ఐ హితవు పలికారు.

కంటి ఆపరేషన్లకు 20మంది ఎంపిక

పుంగనూరు: పట్టణంలోని లయన్స్‌క్లబ్ ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి మంచి స్పందన లభించింది. జిల్లాప్రాజెక్ట్ మేనేజర్ డాక్టర్ శివ, క్లబ్ అధ్యక్షుడు త్రిమూర్తిరెడ్డి నిర్వహించిన శిబిరంలో కుప్పం పీఈఎస్ మెడికల్ కళాశాల వైద్యులు 60 మంది రోగులకు కంటి వైద్య పరీక్షలు చేశారు. వీరిలో 20 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు రజియా, సురేష్, రఘుపతిరెడ్డి, రెడ్డిప్రసాద్, కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు

పుంగనూరు: నృసింహస్వామి జయంతి సందర్భంగా ఆదివారం మండలంలో ఏడూరులోని శ్రీలక్ష్మీనరసింహస్వామి, గూడూరుపల్లెలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఏడూరు ఆలయ ప్రధాన అర్చకులు నటరాజ స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక హోమాలు నిర్వహించారు. లక్ష్మీనరసింహస్వామి స్తోత్రపారాయణం చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

పార్టీ ప్రయోజనాలకే ప్రాధాన్యం



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

శాంతిపురం: వ్యక్తుల కంటే పార్టీ ప్రయోజనాలకే మొదటి ప్రాధాన్యత ఇస్తామని మండల వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు స్పష్టం చేశారు. పార్టీ మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు కే.కోదండరెడ్డి, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి జేఎం కృష్ణమూర్తి ఆదివారం శాంతిపురంలో విలేకరులతో మాట్లాడారు. పార్టీకి నష్టం కలిగించే చర్యలకు పాల్పడే వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. పార్టీ నుంచి సస్పెన్షన్‌కు గురైన వారితో స్థానిక జెడ్పీటీసీ సభ్యుడి నివాసంలో జరిగిన సమావేశానికి పార్టీతో సంబంధం లేదన్నారు. దీనిలో పాల్గొన్న వారిని ఇకపై పార్టీ కార్యక్రమాలకు రానివ్వబోమని చెప్పారు. పార్టీ ఆదేశాలను ధిక్కరించి గత అసెంబ్లీ ఎన్నికల్లో రెబెల్‌గా పోటీ చేసిన వారికి తమ పార్టీతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. కార్యకర్తలకు అధికార పార్టీ వేధింపులు, ఇతర సమస్యలపై తమ దృష్టికి వచ్చిన అన్ని అంశాలలో పూర్తి సాయంగా ఉంటున్నామన్నారు. పార్టీ కష్టకాలంలో ఉంటే ఇప్పుడు కార్యకర్తలను తప్పుదారి పట్టించే చర్యలకు పాల్పడటం, రహస్య అజెండాతో నాయకులుగా ఎదిగే ప్రయత్నాలు చేసేవారు దానికి తగిన మూల్యం చెల్లించాల్సి ఉంటుందన్నారు. పార్టీని, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిలను అభిమానించే క్యాడర్‌కు అండగా ఉంటూ పార్టీని పటిష్టం చేసుకునేందుకు అందరూ కలిసిరావాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల కో–కన్వీనర్లు ప్రభాకర్‌రెడ్డి, గొనివారి నాదమణి, శ్రీధర్‌రెడ్డి, నాగరాజు, కెడి మురుగేష్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన ‘దుర్యోధన వధ’



కుప్పం రూరల్: మహాభారత ఉత్సవాల్లో భాగంగా వెండుగంపల్లి ధర్మరాజుల ఆలయం వద్ద ఆదివారం దుర్యోధన వధ ఘట్టం భక్తులను ఆకట్టుకుంది. సాయంత్రం దేవాలయ ఆవరణలో దుర్యోధనుని మట్టి ప్రతిమ వద్ద కళాకారులు దుర్యోధనుడు, కృష్ణుడు, భీముడు, అర్జునుడి వేషధారణలో వధ ఘట్టాన్ని ప్రదర్శించారు. భీముడు, దుర్యోధనుడు రోషావేశాలతో కలియబడుతూ వధ ఘట్టాన్ని ఆద్యంతమూ రక్తి కట్టించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

తల్లికి మించిన దైవం లేదు



కళామందిరంలో నిర్వహిస్తున్న తల్లికి వందనం కార్యక్రమం

పలమనేరు: తల్లికి మించిన దైవం లేదని స్థానిక తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి నిర్వాహకులు తులసీనాథం నాయుడు అన్నారు. స్థానిక కళామందిరంలో ఆదివారం అంతర్జాతీయ మాతృ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. నియోజవర్గంలోని వందమంది తల్లులకు వారి పిల్లలతో పాదాభివందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణానికి చెందిన పలువురు ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

కమనీయం..ద్రౌపదీ కల్యాణోత్సవం



కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు



కల్యాణోత్సవ శోభతో పాండవుల విగ్రహాలు

- మొక్కులు తీర్చుకునేందుకు పోటెత్తిన జనం

గుడుపల్లె: మండలంలోని యామగానిపల్లెలో నిర్వహిస్తున్న శ్రీ ద్రౌపదీ సమేత ధర్మరాజుల మహా భారత మహోత్సవాలలో భాగంగా ఆదివారం శ్రీ ద్రౌపదీ ధర్మరాజుల కల్యాణోత్సవం భక్తజన సందడి నడుమ నిర్వహించారు. కల్యాణోత్సవం సందర్భంగా ఆలయం వద్ద పచ్చని తోరణాలతో పందిళ్లు వేసి, విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. ఆలయ ప్రాంగణంలో పాండవుల విగ్రహాలతో పాటు ద్రౌపదీదేవి విగ్రహాలను పట్టువస్త్రాలతో అలంకరించారు. అనంతరం శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. ఇక్కడ పాటిస్తున్న ఆనవాయితీ ప్రకారం యామగానిపల్లెలోని వివాహం కాని యువతి చేత ద్రౌపదీదేవికి తాళి కట్టించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భారీ సంఖ్యలో మొక్కులు చెల్లించేందుకు భక్తులు వచ్చారు. అమ్మవారికి నలుగులు, చీరలు వంటి ముడుపులు చెల్లించి పట్టు వస్త్రాలను సమర్పించారు. అనంతరం ద్రౌపదమ్మ విగ్రహాన్ని ఆలయం చుట్టూ మంగళవాయిద్యాల నడుమ ఊరేగించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి భక్తుల కాలక్షేపానికి పౌరాణిక నాటకాన్ని ప్రదర్శించారు.